

డాక్టర్ దుర్గామహేశ్వరరావుకు బెస్ట్ అవార్డు


అవార్డు అందుకుంటున్న మహేశ్వరరావు

తణుకు : తణుకు పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ దుర్గామహేశ్వరరావుకు జిల్లా బెస్ట్ ఫ్యామిలీ ప్లానింగ్ సర్జన్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి చేతుల మీదుగా ఆయన అవార్డు అందుకున్నారు. అనంతరం మహేశ్వరరావు మాట్లాడుతూ ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, బాధ్యత మరింత పెరిగిందని చెప్పారు. నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత మహేశ్వరరావు అవార్డు పొందడం ఇది రెండోసారి. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు దుర్గామహేశ్వరరావుకు అభినందనలు తెలిపారు. యూనిట్ సిబ్బంది అభినందించారు.

ఖాకీల కర్కశత్వం

ఉద్రిక్తంగా అంగన్‌వాడీల 36 గంటల ధర్నా
అంగన్వాడీలపై పోలీసుల జులుం
మహిళలపై ఎక్కడపడితే అక్కడ చేతులు వేసి బూటు కాలుతో తొక్కిన వైనం
ధర్నాను అడ్డుకునేందుకు మూడుచోట్ల బారికేడ్లు
అంగన్వాడీలకు పోలీసులకు మధ్య వాగ్వివాదం, తోపులాట
స్పృహ తప్పిన యూనియన్ జిల్లా అధ్యక్షులు జాన్సీలక్ష్మి, కమిటీ సభ్యులు హసీనా, మరికొందరికి తీవ్రగాయాలు
ధర్నా విజయవంతం
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై మండిపడ్డ ఎంఎల్‌సి వెంకటేశ్వరరావు


ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - భీమవరం / భీమవరం రూరల్

అంగన్వాడీలపై పోలీసులు జులుం ప్రదర్శించారు. ఎక్కడపడితే అక్కడ చేతులు వేసి బూటు కాళ్లతో తొక్కి కర్కశంగా వ్యవహరించారు. అసభ్యకర పదజాలంతో దూషించారు. బారికేడ్లను అంగన్వాడీలపై అడ్డుపెట్టి కాళ్లతో నొక్కిపెట్టి విచక్షణారహితంగా ప్రవర్తించారు. యూనియన్ జిల్లా నేతలు, సభ్యులు స్పృహ కోల్పోయారు. వందలాది మంది అంగన్వాడీలు గాయాలపాలయ్యారు. ఆగ్రహించిన అంగన్వాడీలు బారికేడ్లను చొచ్చుకుని వేలాది మంది


నేతను అడ్డుకుంటున్న పోలీసులు

కలెక్టరేట్‌లోకి దూసుకెళ్లారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సుమారు నాలుగు గంటల పాటు ఆందోళన ఉధృతంగా సాగింది. సమస్యలపై అంగన్వాడీలు చేపట్టిన 36 గంటల నిరవధిక ధర్నా విజయవంతమైంది.

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో చేపట్టిన 36 గంటల నిరవధిక ధర్నా రెండో రోజు మంగళవారం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. విస్సాకోడేరు పెద్దవంతెన ధర్నా ప్రాంగణం నుంచి కలెక్టరేట్ వరకూ అంగన్వాడీలు భారీ ప్రదర్శన నిర్వహించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అంగన్వాడీలను అడ్డుకునేందుకు కలెక్టరేట్‌కు వెళ్లేమార్గంలో మూడుచోట్ల బారికేడ్లను ఏర్పాటు చేసి మహిళా పోలీసులను, కానిస్టేబుళ్లు 60 మందిని మోహరించారు. స్థానిక తిరుమల విద్యాసంస్థల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్ వద్దకు చేరుకున్న అంగన్వాడీలను, సిఐటియు నేతలను పోలీసులు అడ్డుకున్నారు. కలెక్టరేట్ కు వెళ్లేందుకు అనుమతి లేదని వన్ టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్, భీమవరం రూరల్ ఎస్ఐ మోహన్‌రావు చెప్పడంతో ఎందుకు వెళ్లనీయరంటూ అంగన్వాడీలు ప్రశ్నించారు. న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని రెండు రోజుల నుంచి ధర్నా చేస్తున్నప్పటికీ ఏ ఒక్కరు పట్టించుకోలేదని, సమస్యలు అధికారులకు చెప్పుకోవడానికి కలెక్టరేట్‌కి వెళ్తుంటే అడ్డుకోవడం సరైన విధానం కాదని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో అంగన్వాడీలు, సిఐటియు నేతలకు పోలీసుల మధ్య వాగ్వివాదం జరిగింది. దీంతో ఉద్రిక్తత పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరువురి మధ్య తోపులాట జరిగింది. ఈ నేపథ్యంలో అంగన్వాడీలు బారికేడ్లను చొచ్చుకుని వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అంగన్వాడీలు, సిఐటియు నేతలు, సీఐ అడబాల శ్రీనివాస్ సైతం కింద పడిపోయారు. దీంతో ఆగ్రహించిన సిఐ, రూరల్ ఎస్ఐలు, అంగన్వాడీలపై విరుచుకుపడ్డారు. కింద పడిపోయిన అంగన్వాడీలను బూటుకాళ్లతో తొక్కి పడేశారు. మహిళలని కూడా చూడకుండా దుర్భాషలాడుతూ ఎక్కడపడితే అక్కడ తాకుతూ గెంటేశారు. దీంతో


నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

అంగన్వాడీలు కొంతమంది ఒకేసారి బారికేడ్లను తోసుకుని కలెక్టరేట్‌లోకు దూసుకెళ్లారు. ఈ క్రమంలో మరోసారి తోపులాట జరిగింది. బారికేడ్ల మధ్యలో అంగన్వాడీలు చిక్కుకొని ఆర్తనాదాలు తీశారు. పలువురు గాయాలపాలయ్యారు. అక్కడ నుంచి కలెక్టరేట్ వరకూ దూసుకెళ్లడంతో కలెక్టరేట్ వద్ద మళ్లీ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారంతా అక్కడే నేలపై బైఠాయించి నిరసన తెలిపారు. జిల్లా కలెక్టర్ వచ్చి తమ గోడు వినాలని డిమాండ్ చేశారు. డిఆర్ఒ సీసీ వచ్చి వారితో మాట్లాడారు. డిఆర్ఒ సీసీ వద్దంటూ ఆందోళన కొనసాగింది. సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ డిఆర్ఒ కె.కృష్ణవేణితో మాట్లాడి సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రం అందజేశారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ఆమె హామీ ఇచ్చారు. అనంతరం ఐసిడిఎస్ పీడీ సుజాతారాణికి కూడా వినతిని అందించారు. సమస్యలు పరిష్కరించేలా తనవంతు కృషి చేయడంతో పాటు జాయింట్ సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఏక వచనాలు... పిడుగుద్దులు

సిఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ మోహన్‌రావు వ్యవహరించిన తీరు అత్యంత దారుణంగా ఉందని అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరువురి మధ్య జరిగిన తోపులాటలో కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతి బాబును సిఐ పిడుగుద్దులతో కిందకు నెట్టారు. సిఐటియు జిల్లా నాయకులు పివి ప్రతాపన సైతం మెడ పట్టుకుని అత్యంత దారుణంగా సిఐ, ఎస్ఐలు నెట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.జర్ఖాన్సీలక్ష్మి, కళ్యాణితో పాటు ఎంతోమంది అంగన్వాడీలపై పోలీసులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గోపాలన్, రాజా రామ్మోహన్ రాయ్, నేతలు వాసుదేవరావు, ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ సైతం తోపులాటలో పోలీసులు కిందకు నెట్టేశారు.

తోపులాటలో గాయపడిన అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జాన్సీలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు హసీనా బేగం, కమిటీ సభ్యులు వైట్ల ఉషారాణి, దేవీని భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావుతో పాటు సిఐటియు నేతలు పరామర్శించారు. కలెక్టరేట్ వద్ద హసీనా బేగం పడిపోవడంతో కలెక్టరేట్‌లోకి తీసుకెళ్తామని అంగన్‌వాడీలు కోరినప్పటికీ సిఐ మాత్రం విచక్షణ మరిచి చెట్టు కిందకు తీసుకెళ్లండి అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో అంగన్‌వాడీలు ఆయనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భారీ ప్రదర్శన

విస్సాకోడేరు పెద్దవంతెన ధర్నా ప్రాంగణం నుంచి అంగన్వాడీలు కలెక్టరేట్ వరకూ భారీ ప్రదర్శన నిర్వహించారు. సుమారు రెండు కిలోమీటర్ల వరకూ అంగన్వాడీలు సిఐటియు నేతలు ప్రదర్శన చేశారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిమంది అంగన్వాడీలు పాల్గొన్నారు.

పలుసంఘాల సంఘీభావం

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు, ఐకెపి యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షులు నిర్మలాదేవి, సిఐటియు జిల్లా నాయకులు పివి.ప్రతాప్, పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకురాలు వరలక్ష్మి, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నాయకులు


అధికారులకు వినతిని అందిస్తున్న అంగన్‌వాడీలు

అజయకుమారి, ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎల్.సాయిశ్రీనివాస్, టిడిపి ముఖ్య నాయకులు మేరగని నారాయణమ్మ ధర్నాకు సంఘీభావం తెలిపారు.

దుర్మార్గంగా వ్యవహరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
పిడిఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నాయని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు విమర్శించారు. అంగన్వాడీలు చేపట్టిన ధర్నాకు సంఘీభావం తెలిపిన ఆయన కలెక్టరేట్ వద్ద జరిగిన నిరసన సభలో మాట్లాడారు. 36 గంటల పాటు అంగన్వాడీలు 26 జిల్లాలో వేలాదిమంది ఎందుకు ధర్నా చేస్తున్నారో ముఖ్యమంత్రి జగన్ అర్థం చేసుకోవాలన్నారు. మాట తప్పను మడమ తిప్పను, నేనున్నాను.. నేను విన్నాను అని చెప్పే జగన్ పాదయాత్రలో అంగన్వాడీలకు ఇచ్చిన హామీ ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. నాలుగేళ్లలో అంగన్‌వాడీలకు రూ.వెయ్యి పెంచి సంక్షేమ పథకాలు దూరం చేశారని విమర్శించారు. సొంత డబ్బుతో గ్యాస్ కొనుగోలు చేసి వంటలు చేస్తున్నారని, 2017 నుంచి కనీసం టిఎ బిల్లులు ఇవ్వకపోవడం దారుణమన్నారు. 1972 చట్టం ప్రకారం గ్రాడ్యుటీ అందించాలని సుప్రీంకోర్టు ఆదేశాలున్నప్పటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. శాసనమండలిలో అంగన్వాడీల సమస్యలు లేవనెత్తుతానని చెప్పారు.


సైకిల్ యాత్రలో నాయకులు

విద్యాహక్కు చట్టం అమలేదీ..?

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్

రెండో రోజు కొనసాగిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర

ప్రజాశక్తి - పాలకొల్లు

నాడు-నేడు పథకంలో పాఠశాలలను అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం విద్యాహక్కు చట్టం ప్రకారం పాఠశాలల్లో ఉండాల్సిన ఉపాధ్యాయులను నియమించడంలోనూ, చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కె.ప్రసన్నకుమార్ విమర్శించారు. జిల్లాలో ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధే లక్ష్యంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన చేపట్టిన విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర రెండోరోజు మంగళవారం పాలకొల్లులో సాగింది. ముందురోజు నరసాపురం వరకూ యాత్ర సాగింది. ఉదయం పాలకొల్లు నుంచి ప్రారంభమైంది. ఈ సందర్భంగా పట్టణంలో పలు హైస్కూళ్లు, కళాశాలల హాస్టళ్లను ఎస్ఎఫ్ఐ నాయకులు సందర్శించారు. బివిఆర్ఎం బాలికల హైస్కూల్లో విద్యార్థులనుద్దేశించి కె.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఇస్తున్న జగనన్న విద్యా కానుక అందరికీ పూర్తిస్థాయిలో అందించాలన్నారు. 2019 ఎన్నికల ప్రచారంలో కుటుంబంలో చదువుకున్న ప్రతివిద్యార్థికీ 'అమ్మఒడి' అందిస్తానని హామీ ఇచ్చి నేడు ఇంటిలో ఒక్కరికి మాత్రమే వర్తింపజేస్తున్నారన్నారు. అది కూడా రకరకాల షరతులతో ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం నాడు - నేడుతో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం మంచిపరిణామమని, కానీ ఆ పాఠశాలలో విద్యాహక్కు చట్టం ప్రకారం ఉండాల్సిన ఉపాధ్యాయులు ఉన్నారో లేదో ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. 28 మంది ఉండాల్సిన పాఠశాలలో 19 మందిని నియమించడం దారుణమన్నారు. అనంతరం డిఎన్ఆర్ మహిళా కళాశాలలో జరిగిన సభలో జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకూ ఒక్క ప్రభుత్వ యూనివర్సిటీ కూడా నెలకొల్పకపోవడం చాలా దారుణమన్నారు. ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో పీజీలో అధునాతన కోర్సులు ప్రారంభించాలన్నారు. ఎంఎస్‌సి కెమిస్ట్రీ కోర్సు ఉన్నప్పటికీ గత సంవత్సరం కళాశాలలో ఎవరూ చేరలేదని, ప్రిన్సిపల్ బాధ్యతగా వ్యవహరించి పీజీ కళాశాలను అభివృద్ధి చేయాలన్నారు. మండలానికి జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారకానీ, ఆ కళాశాలలో టీచర్లను నియమించకపోవడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి.వాసు, జిల్లా ఉపాధ్యక్షులు ఎమ్‌డి.జాన్, టి.ప్రసాద్, పట్టణ కార్యదర్శి కె.యశ్వంత్, పి.వెంకటలక్ష్మి, జి.అన్నపూర్ణ, జి.శ్రీను, బి.గణేష్, నాయకులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

టూరిజం ప్రాంతాలను గుర్తించాలి

అధికారులకు కలెక్టర్ ప్రశాంతి ఆదేశం

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో టూరిజం అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి టూరిజం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దొంగరావిపాలెం, పెదమల్లం, పేరుపాలెం టూరిజం ప్రాంతాల్లో విద్యుత్ సౌకర్యం మెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. నరసాపురం, మొగల్తూరు పరిసర ప్రాంతాల్లో తీరం వెంబడి ప్రజల రాకపోకలకు అనుకూలమైన ప్రాంతాల్లో 10 నూతన బీచ్‌లను టూరిజం అధికారులు గుర్తించడం జరిగిందన్నారు. వీటికి సంబంధించిన మ్యాపులను తయారు చేసి కమిటీ ముందు ఉంచాలని ఆదేశించారు. కుంచనపల్లిలో టూరిజం అభివృద్ధికి గుర్తించిన మూడు ఎకరాల విస్తీర్ణంలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశించారు. పేరుపాలెం, మోళ్లపర్రు బీచ్‌లను బ్లూ ఫ్లాగ్ బీచ్‌లుగా ప్రతిపాదించి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ అధికారులు సందర్శించారన్నారు. దేశంలో బ్లూ ఫ్లాగ్ బీచ్‌లను పది ప్రాంతాల్లో గుర్తించగా వాటిలో రెండు మన జిల్లాకు చెందినవే ఉన్నాయన్నారు. బ్లూ ఫ్లాగ్ బీచ్‌లుగా ఎంపికైన సర్టిఫికేషన్ వస్తే భవిష్యత్తులో వాటి అభివృద్ధికి అధిక మొత్తంలో నిధులు రావడంతో పాటు జిల్లాకు మంచి పేరు వస్తుందన్నారు. పేరుపాలెం బీచ్‌లో సిట్‌ఔట్స్, వాష్ రూమ్స్, క్యాఫ్‌టేరియా, తదితర మౌలిక వసతుల కల్పనకు రూ.20 లక్షలతో ప్రతిపాదనలు తయారు చేశామన్నారు. జిల్లాలో యువ టూరిజం క్లబ్బులు ఏడో తరగతి నుండి పదో తరగతి వరకూ, ఇంటర్ విద్యార్థులతో ఒక్కొక్క క్లబ్బుకు 25 నుండి 30 మంది విద్యార్థులతో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీటిద్వారా విద్యార్థుల్లో పర్యాటకం, సంస్కృతి పట్ల అవగాహన కల్పించేందుకు వివిధ కార్యక్రమాలను రూపొందించాలని టూరిజం అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో టూరిజం రీజినల్ డైరెక్టర్ వి.స్వామి నాయుడు, జిల్లా టూరిజం అధికారి ఎమ్‌డి హెచ్ మెహర్‌రాజ్, డిప్యూటీ ఇంజనీర్ ఎస్.సత్యనారాయణ, టూరిజం మేనేజర్ ఎస్.పట్టాభి రామన్ పాల్గొన్నారు.

పవన్ వ్యాఖ్యలపై వాలంటీర్ల నిరసన


ఆచంటలో...

ప్రజాశక్తి - ఆచంట

వాలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై నిరసనగా ఆచంట నియోజకవర్గ స్థాయిలో ఆచంట కచేరీ సెంటర్‌లో వాలంటీర్లు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పవన్‌కి వ్యతిరేకంగా పవన్‌కల్యాణ్ డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వాలంటీర్లు మాట్లాడుతూ వాలంటీర్ల పట్ల పవన్‌కల్యాణ్ తీరు మార్చుకోవాలన్నారు. అనంతరం పవన్‌కల్యాణ్ దిష్టి బొమ్మను దహనం చేశారు. అనంతరం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పవన్‌కల్యాణ్‌పై ఫిర్యాదు చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉండి : మహిళల అక్రమ తరలింపునకు వాలంటీర్లే కారణమంటూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన అర్థరహిత వ్యాఖ్యలకు వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఉండి మండల వాలంటీర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఉండి మెయిన్ సెంటర్ నుంచి పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి పవన్‌కల్యాణ్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేసి కేసు నమోదు చేయాలని ఉండి ఎస్ఐ కె.గంగాధరరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ స్వచ్ఛందంగా ప్రజా సేవ చేస్తున్న తమను కించపరిచేలా అగౌరవపరుస్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడిన మాటలను బేషరతుగా వెనక్కి తీసుకుని తమకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉండి మండల వ్యాప్తంగా వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గ్రామ సర్పంచులు పాల్గొన్నారు.

పాలకోడేరు : చిత్తశుద్ధితో సేవలందిస్తున్న తమపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు క్షమాపణలు చెప్పాలని పాలకోడేరు మండలానికి చెందిన గ్రామ వాలంటీర్లు డిమాండ్ చేశారు. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలకు నిరసనగా పాలకోడేరు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైసిపి



ఉండిలో...

నాయకులు, గ్రామ వాలంటీర్లు మంగళవారం విస్సాకోడేరులో నిరసన వ్యక్తం చేశారు. విస్సాకోడేరు గ్రామంలో 165 జాతీయ రహదారిపై నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం గొరగనముడి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకున్న గ్రామ వాలంటీర్లు పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణరాజు, సర్పంచులు బొల్లా శ్రీనివాస్, భూపతిరాజు వంశీకృష్ణంరాజు, జంగం సూరిబాబు, మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ఆదాడ లక్ష్మీతులసి, కోఆప్షన్ సభ్యురాలు స్వర్ణలత, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు వినతి

ప్రజాశక్తి - తణుకు రూరల్


కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న టీచర్స్, అధ్యాపకులు, సిబ్బందికి చట్ట ప్రకారం కనీస వేతనాలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శులు పివి.ప్రతాప్, కర్రి నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఒ కృష్ణవేణికి, జిల్లా కలెక్టర్ ప్రశాంతికి సిఐటియు ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు, ప్రతాప్ మాట్లాడుతూ కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో పనిచేస్తున్నవారికి చట్టాలు అమలు కావడంలేదన్నారు. ఎన్నో ఏళ్లుగా పని చేస్తున్నా నేటికీ పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్, గ్రాడ్యుటీ, ఉద్యోగ భద్రత వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల వద్ద రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో పని చేస్తున్న వారి సమస్యలు చెప్పుకోవడానికి కార్మిక, రెవెన్యూ, విద్యా శాఖల ఆధ్వర్యంలో గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు నిర్వహించిన సర్వేలో ఎన్నో సమస్యలు వచ్చాయన్నారు. టీచర్స్, అధ్యాపకులు, సిబ్బంది సమస్యల పరిష్కారం కోసం అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జవ్వాది శ్రీనివాస్, తవిటి నాయుడు పాల్గొన్నారు.

వాలంటీర్ వ్యవస్థపై కోర్టులో ఛాలెంజ్ చేస్తాం..!

జనసేన అధినేత పవన్ కల్యాణ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

వ్యక్తిగత డేటాను సేకరించడం చట్టవిరుద్ధమని, జగన్ వాలంటీర్ల చేత వ్యక్తిగత డేటాను సేకరించడం, ఆ వ్యవస్థపై కోర్టులో ఛాలెంజ్ చేస్తామంటూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలిపారు. ఏలూరు క్రాంతి కళ్యాణ మండపంలో ఉంగుటూరు నియోజవర్గనేతలతో, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పవన్ మాట్లాడారు. డబ్బు సంపాదించాలని పోటీపడితే ఏడాదికి రూ.వెయ్యి నుంచి రూ.1500 కోట్లు సంపాదిస్తానన్నారు. 18 ఏళ్ల వయస్సులోనే సమాజం వైపు రావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. విద్య, చదువు ప్రజలకు ప్రాథమిక హక్కులన్నారు. వివాహమైన మహిళ గురించి ప్రస్తావించాలంటే భార్య, సతీమణి అని అంటామని, జ్ఞానంలేని జగన్ మాత్రం పెళ్లాం అంటూ సంబోదిస్తారన్నారు. సంస్కారంలేని, క్యారెక్టర్ లేని వ్యక్తి జగన్ అని విమర్శించారు. వాలంటీర్ వ్యవస్థ సంఘ విద్రోహ శక్తులకు ఉపయోగపడుతుందన్నారు. 50 కుటుంబాలకు ఒక జగన్ తయారయ్యాడన్నారు. వ్యక్తిగత సమాచారం వాలంటీర్లకు ఇవ్వొద్దన్నారు. జనాలకు జనసేన కాపాలా కాయాలన్నారు. జగన్ అనే వ్యక్తి ఉంటే పవన్‌కల్యాణ్ ఉంటాడన్నారు. ఒక కొడుకుని దేశానికి ఇచ్చేశానని అనుకోమని అమ్మకు చెప్పానన్నారు. వైసిపిని ప్రశ్నించి, ఎదుర్కోవాలంటే కార్యకర్తలకు పిలుపునిచ్చారు.



భూ సమస్య పరిష్కారానికి కలెక్టర్ చర్యలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కాళీపట్నం భూ సమస్యపై కలెక్టర్ పి.ప్రశాంతి నేతృత్వంలో అధికారులు మంగళవారం సమావేశం అయ్యారు. కాళీపట్నంలో సుమారు 7500 ఎకరాల భూములకు సంబంధించి హక్కు నిర్ధారణపై వివాదం నెలకొంది. పరిష్కారంలో భాగంగా కాళీపట్నం రెవెన్యూ గ్రామాల్లో భూములకు సంబంధించిన రైతులు కోర్టులో న్యాయపోరాటం చేస్తున్నారు. రైతులు మేడిది వెంకట మాధవ కృష్ణారావు వద్ద నుంచి వివరాలను నమోదు చేశారు. జెసి రామ్‌సుందర్‌రెడ్డి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, తహశీల్దార్ జి.అనితకుమారి, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమని బాపూజీ, రైతులు సరిపల్లి సుబ్బరాజు, నడింపల్లి రామకృష్ణంరాజు, సతినేని మోహన్‌రావు, మోటెపల్లి రాం భాస్కరరావు ఉన్నారు.

డ్రైనేజీలో చెత్తాచెదారం తొలగింపు

ప్రజాశక్తి - పెనుమంట్ర

పాలమూరులోని డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని మంగళవారం తొలగించారు. వర్షం కురిసి డ్రైనేజీలో నీరు మునగడంపై ప్రజాశక్తి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు డబ్ల్యుఎస్ ఏఇ మూర్తిరాజు స్పందించారు. గతంలో రూ.20 లక్షలతో నిర్మించిన డ్రైనేజీలో చెత్తాచెదారాన్ని తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

మధ్యాహ్న భోజనాన్ని వినియోగించుకోండి

ప్రజాశక్తి - ఆచంట

విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందిస్తుందని, దీనిని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. కొడమంచిలి పాఠశాలలో మంగళవారం మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. వంట చేస్తున్నవారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలని, అలసత్వం వహించవద్దని తెలిపారు. ఆయనతో పాటు ఎంపిటిసి సభ్యులు చిలుకూరి నరేంద్ర, యల్లమెల్లి రాజేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ ఉన్నారు.



వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - ఉండి

ద్విచక్రవాహనదారులందరూ హెల్మెట్ ధరించాలని ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు సూచించారు. ఉండి మెయిన్ సెంటర్లో హెల్మెట్ ధారణపై మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కొన్ని నెలలుగా హెల్మెట్ ధారణపై మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. వాహనదారులు హెల్మెట్ ధరించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. హెల్మెట్ ధరించని వాహనచోదకులను నిలుపుదల చేసి హెల్మెట్ తెచ్చుకుని ధరించి వెళ్లాలని హెచ్చరిస్తున్నట్లు వారు తెలిపారు.

కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ప్రజాశక్తి - పెనుమంట్ర

కౌలు రైతులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. సంఘం జిల్లా విస్తృత సమావేశం మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో మంగళవారం జిల్లా అధ్యక్షులు కె.సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలురైతుల చట్టానికి భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా కౌలురైతుల పేరునే పంట నమోదు చేసి రైతుభరోసా, పంట రుణాలు, పంటనష్టం, బీమా కౌలు రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సాగునీరు పూర్తి స్థాయిలో విడుదల చేయాలని, కాలువలను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు, నాయకులు కె.గోపాలన్, పి.నర్సింహమూర్తి, కె.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, కె.పూర్ణారావు, ఎ.సన్యాసిరావు, కె.సత్యనారాయణ, కె.జగన్నాధం పాల్గొన్నారు.

రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షునిగా వెంకటరమణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం సమావేశం మంగళవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సూరంపూడి వెంకటరమణ, కార్యదర్శిగా వంశీకృష్ణ, కోశాధికారిగా మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా బాబూరావు, ఫైలు శ్రీనివాసరావు, జగదీష్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

'రానున్న ఎన్నికల్లో టిడిపిదే విజయం'

ప్రజాశక్తి - మొగల్తూరు

టిడిపి యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళానికి ప్రజల స్వచ్ఛందంగా మద్దతిస్తున్నారని ఆ పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. నారా లోకేష్ చేపట్టిన యువగళం యాత్ర రెండు వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మొగల్తూరులోని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శన చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరిగినీడి రాజ్యలక్ష్మి, కత్తిమండ ముత్యాలరావు, సత్తినేని సర్వేశ్వరరావు, జోగి పండు, పాల రాంబాబు, గోపాలం పాల్గొన్నారు.

పాలకొల్లు : లోకేష్ యువగళం పాదయాత్ర రెండు వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పాలకొల్లు క్షీరా రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ అరాచక పాలన నుంచి రాష్ట్రాన్ని కాపాడాలన్నారు. యువగళం పాదయాత్ర వైసిపి ప్రభుత్వం ఆటంకాలు సృష్టించిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు పెచ్చెట్టి బాబు, కర్నేన గౌరు నాయుడు, కడలి గోపి, కర్నేన రోజారమణి, విజయభాస్కర్, బోనం నాని, మామిడిశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగళం పాదయాత్ర రెండు వేల కిలోమీటర్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం తాడేపల్లిగూడెం పట్టణంలో సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో ఈ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్ నాయకత్వంలో పార్టీ ముందుకు దూసుకుపోతుందన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయం సాధించడం తథ్యమన్నారు. పాదయాత్ర గొర్రెల సూరన్న కళ్యాణ మండపం నుంచి పోలీస్ ఐలాండ్ సెంటర్, ఎన్‌టిఆర్ చౌక్, తాలూకాఫీస్ సెంటర్ వరకు సాగింది. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, రాష్ట్ర కార్యదర్శి పోతుల అన్నవరం, పార్టీ పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు, రూరల్ మండలం అధ్యక్షుడు పరిమి రవికుమార్, తెలుగు రైతు జిల్లా అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి, షేక్ మీరా పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : యువగళం పాదయాత్ర రెండువేల కిలోమీటర్ల పూర్తిచేసుకున్న సందర్భంగా టిడిపి పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యరాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి కేక్ కట్ చేశారు. అనంతరం భీమవరం పట్టణంలో యువగళం సంఘీభావ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, రాష్ట్ర కార్యదర్శి వేంద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామస్తులు కలిసిమెలిసి ఉండాలి : డిఎస్‌పి

ప్రజాశక్తి - పెనుగొండ

గ్రామస్తులందరూ కలిసిమెలిసి ఉండాలని డిఎస్‌పి కె.మనోహరాచారి సూచించారు. మండలంలోని నడిపూడి మిట్టపాలెంలో రెండు గ్రూపుల మధ్య వివాదం నెలకొనడంతో సర్పంచుల ఆధ్వర్యంలో డిఎస్‌పి మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో అన్ని కులాలవారు పరస్పర సంబంధాలు కలిగి ఉండాలన్నారు. ప్రతిఒక్కరూ స్వేచ్ఛ కలిగి ఉంటూ రాజ్యాంగం ఇచ్చిన హక్కులను వినియోగించుకుంటూ గ్రామంలో అందరు కలిసిమెలిసి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గురుమూర్తి రెడ్డి పాల్గొన్నారు.

మానసిక వికలాంగులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - ఆచంట

మానసిక వైకల్యం చదువుకు ఆటంకం కాదని ఆచంట మండల సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. మండలంలోని కొడమంచిలి గ్రామంలో మానసిక వికలాంగ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.250 వేలతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మూడు ఎంఆర్ కిట్లను సీతారామ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక వైకల్యం కలిగిన విద్యార్థులు కొడమంచిలి హైస్కూల్లో ఎనిమిది ఉన్నారన్నారు. వీరికి విద్యపై ఏకాగ్రత సాధించడానికి, విద్య పట్ల ఆసక్తిని కల్పించడానికి ఈ కిట్లు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. జగనన్న ప్రభుత్వంలో విద్య పట్ల అనేక పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ఈ కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు చిలుకూరి నరేంద్ర, యల్లమెల్లి రాజేష్, పోలిశెట్టి వనమరాజు, వైసిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు కొండేటి రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామకృష్ణ, స్పెషల్ టీచర్ కె.రామేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది రమణరావు, పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

లబ్ధిదారులు త్వరితగతిన గృహ నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ కోరారు. భీమవరం హౌసింగ్ డిఇగా తాడేపల్లిగూడెం నుంచి బదిలీపై వచ్చిన వివిఎన్.వేణుగోపాల్ మంగళవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు అహర్నిశలు కష్టపడుతున్నారని, లబ్ధిదారులు ఆ దిశగా ఆలోచన చేసి గృహాలను నిర్మించుకోవాలని కోరారు. గృహ నిర్మాణాలపై లబ్ధిదారులకు హౌసింగ్ అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ రూరల్ ఎఇ శశికుమార్ పాల్గొన్నారు.

ఏకపక్ష నిర్ణయాలతో కుంటు పడుతున్న గ్రామాభివృద్ధి

డిపిఒకు గొల్లలకోడేరు పంచాయతీ పాలకవర్గ సభ్యుల ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు పంచాయతీలో ఏకపక్ష నిర్ణయాలతో గ్రామాభివృద్ధి కుంటు పడుతుందని పలువురు వార్డు సభ్యులు ఆరోపిస్తున్నారు. గ్రామ ఉప సర్పంచి కలిదిండి శ్రీనివాసవర్మ, కార్యదర్శి రమాలీలలపై వార్డు సభ్యులు కుక్కల బాబూరావు, వీరవల్లి శ్రీనుగోపాలరావు, పద్మావతి, రత్నకళ, ఆనందకుమారి, మంగళవారం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గ్రామ ఉప సర్పంచి కలిదిండి శ్రీనివాసవర్మ అండదండలతో పంచాయతీ కార్యదర్శి అభివృద్ధి పనులను కొన్ని ప్రాంతాలకు మాత్రమే పరిమితం చేస్తున్నారని ఆరోపించారు. మూడు నెలలకోసారి పంచాయతీ బోర్డు సమావేశం నిర్వహించాల్సి ఉండగా గడువు ముగిసిన తరువాత సమావేశం నిర్వహించి సకాలంలో సమావేశం నిర్వహించినట్లు అజెండా పుస్తకంలో నమోదు చేసి అవగాహన లేని తమతో సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. సమావేశంలో తాము ప్రస్తావించిన అంశాలపై తీర్మానాలు చేయడం లేదని పేర్కొన్నారు. గ్రామంలో చాలా వార్డుల్లో అభివృద్ధి పనులు చేయాల్సి ఉన్నప్పటికీ ఉప సర్పంచి ఇంటికి వెళ్లేమార్గంలో కల్వర్ట్ నిర్మాణానికి తీర్మానించారని ఆరోపించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి రమాలీలను వివరణ కోరగా స్పందించలేదు.

ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని పిహెచ్‌సి లంకలకోడేరు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఆరోగ్య అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సంతోషం, శ్రేయస్సు కోసం కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటిద్దాం అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించారు. డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ దేశంలో జనాభా ప్రస్తుతం 142.86 కోట్లు ఉండగా అది రానున్న రోజుల్లో విపరీతంగా పెరిగిపోతున్నా, ప్రజలకు అవగాహన లేకపోవడంతో అనేక అనారోగ్య సమస్యలకు, ఆర్థిక పరిస్థితులు క్షీణించిపోతాయని, కుటుంబ పోషణ వ్యయం అధికమై పరిస్థితి దుర్భరంగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమములో డాక్టర్ ఎం.నవ్యజీవన్, ఆరోగ్య విస్తరణ అధికారి కె.ప్రభాకర్, ఎలిజబెత్ పిహెచ్‌ఎన్ పి.వెంకటస్వామి, ఫార్మసిస్ట్, సీనియర్ అసిస్టెంట్ ఎస్.రమేష్‌బాబు, హెల్త్ సూపర్‌వైజర్లు కుమార్, కమల కుమారి, అమలేశ్వరరావు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

గణపవరం : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మంగళవారం గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గణపవరంలో ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సంతోషనాయుడు మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పాటించి నవ సమాజ నిర్మాణానికి పునాది వేయాలన్నారు. ర్యాలీలో సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, హెల్త్ అసిస్టెంట్లు జి.శ్రీనివాస్, ఎ.కృష్ణ, ఎం.నల్లయ్య, ఎన్.యోహన్, స్టాఫ్ నర్సు పరిమళ, యు.మేరీ పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక ఎఎస్ఎన్ఎం ప్రభుత్వ కళాశాలలో అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.ఉషారాణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : ఆలమూరులో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు వుందిర్తి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కుటుంబ నియంత్రణ పద్ధతుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కొడాలి ప్రదీప్‌కుమార్, సూపర్‌వైజర్ పెద్దిరావు, నానిబాబు పాల్గొన్నారు.

'ఎస్ఆర్‌కెఆర్'లో ఐఇఎల్‌టిఎస్‌పై పరీక్ష



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న రామకృష్ణనిశాంత్‌వర్మ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

విదేశాలలో ఉన్నత విద్యకు వెళ్లే విద్యార్థుల కోసం ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానంపై నిర్వహించే ఐఇఎల్‌టిఎస్ (అంతర్జాతీయ ఇంగ్లీష్ భాష పరిజ్ఞానం)పై పరీక్షా కేంద్రాన్ని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో దేశంలోనే ప్రతిష్టాకరమైన అంతర్జాతీయ విద్యా నిర్వహణ సంస్థ ఐడిపి సంస్థ ఏర్పాటు చేసిందని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ చెప్పారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం కళాశాలలో నిర్వహించిన ఒక ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల ఇంగ్లీష్, ఫారిన్ లాంగ్వేజెస్ హెడ్ డాక్టర్ బిహెచ్‌విఎన్.లక్ష్మి మాట్లాడుతూ ప్రప్రథమంగా ఆంధ్రప్రదేశ్‌లో ఐఇఎల్‌టిఎస్ టెస్ట్ సెంటర్ తమ కళాశాలలో ఏర్పాటు చేశారని వివరించారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు తమ కళాశాల ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ కూడా అందిస్తారని ఆమె వివరించారు. తమ కళాశాల టెస్ట్ సెంటర్‌లో మొదటి సారిగా సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఐడిపి సంస్థ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ అవకాశాన్ని గోదావరి జిల్లాలోని ఇతర ప్రాంతాల విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకొని ఉన్నత చదువులకు మార్గం సుగమం చేసుకోవాలని ఆమె కోరారు.

రహదారి నిర్మించాలని బురదనీటిలో నిరసన

ప్రజాశక్తి - ఉండి

తమ కాలనీల్లో రహదారులను నిర్మించాలని మండలంలోని పెదపుల్లేరు గ్రామానికి చెందిన తూర్పు కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు కాలనీలోని బురద నీటిలో నిలబడి మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తూర్పు కాలనీకి చెందిన పులిమంతుల మావుళ్లు, హరిబాబు మాట్లాడుతూ 1989లో తమకు అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ మూడు సెంట్ల ఇళ్ల స్థలాలను ఇచ్చారన్నారు. జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఇళ్ల స్థలాల సేకరణ కోసం కాలనీలో ఇంటి నిర్మాణాలు చేపట్టని స్థలాలను దౌర్జన్యంగా వెనక్కి తీసుకుని సెంటున్నర స్థలాలను మాత్రమే తమకు ఇచ్చారని వారు తెలిపారు. స్థలాలను వెనక్కి తీసుకునేటప్పుడు కాలనీల్లో రహదారులను నిర్మించి మౌలిక వసతులను కల్పిస్తామని అప్పటి తహశీల్దార్ ఆకుల కృష్ణజ్యోతి తమకు హామీ ఇచ్చారని, కానీ ఆ హామీ నేటికీ నెరవేరలేదని వారు వాపోయారు. కాలనీ వాసులకు జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గేదెల నరసింహులు మద్దతు తెలిపి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నామని ప్రతిఒక్కరూ ఇంటి నిర్మాణాలు చేపట్టాలని పెద్ద ఎత్తున ప్రచారాలు చేస్తున్నారరన్నారు. ఆ ప్రచారాలు ఆచరణలోకి రావట్లేదన్నారు. ఈ కాలనీలో చాలామంది ఇంటి నిర్మాణాలు చేపట్టారని, కానీ ఇంటి నిర్మాణానికి కావాల్సిన మెటీరియల్‌ను తరలించేందుకు రహదారి లేదన్నారు. ఇప్పటికే కాలనీలో ఇంటి నిర్మాణాలు నిర్మించి గృహప్రవేశాలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కాలనీవాసులు స్పందన కార్యక్రమంలో మే 31వ తేదీన ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు కాలయాపన చేస్తున్నారే తప్ప సమస్య పరిష్కారం కోసం ఏ ఒక్క అధికారి రాలేదన్నారు. తమ సమస్యను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు దృష్టికి తీసుకెళ్దామంటే గ్రామంలోని నాయకులు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామంలో నిర్వహించేందుకు సుముఖత వ్యక్తం చేయట్లేదన్నారు. గ్రామంలోని స్వార్థపూరిత రాజకీయాల వల్లనే తమకు ఈ దుస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో కొన్నిచోట్ల స్తంభాలు ఏర్పాటు చేశారు కాని విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదన్నారు. అధికారులు, నాయకులు తక్షణమే స్పందించి తమ కాలనీకి విద్యుత్ సౌకర్యం, డ్రెయినేజీ, గ్రావెల్ రహదారులు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన గ్రామ అధ్యక్షుడు ఆకిన రామకృష్ణ, కాజా సతీష్, కొండేటి ఆంజనేయులు, కర్రి నరసింహులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

ప్రజలకు మెరుగైన సేవలందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - గణపవరం

ప్రజల కోరిన సర్వీసులను అధికారులు సకాలంలో అందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం గణపవరం నాలుగో సచివాలయంలో జరుగుతున్న జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపును ఆకస్మిక తనిఖీ చేశారు. తహశీల్దార్ పి.లక్ష్మి మాట్లాడుతూ ఇప్పటివరకు 2057 ధరపత్రాలు జారీ చేశామని చెప్పారు. కలెక్టర్ మాట్లాడుతూ అవసరమైన చిన్నారులకు ఆధార్ నమోదు చేయాలని చెప్పారు. ధ్రువపత్రాలు ప్రజలకు అందించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ పని దినాలు పెంచాలని, అడిగిన వారందరికీ జాబ్ కార్డులు ఇవ్వాలని చెప్పారు. సచివాలయంలో ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రతిభ కనబరిచిన విఆర్ఒ ఎస్‌బిఎస్ అనూష, ఎస్.పూజిత, వాలంటీర్లు రౌతు అనంతరాణి, డిజటల్ అసిస్టెంట్ ఎన్.కుసుమసత్యవాణిలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ దాసిరాజు, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, గ్రామ సర్పంచి మోర అలంకారం, ఉపసర్పంచి దండు రాము, వైసిపి నాయకులు పుప్పాల పుండరీకాక్షుడు, రంగుల శ్రీను, పంచాయతీ కార్యదర్శి డిఎస్ఆర్.ప్రసాద్ పాల్గొన్నారు.

పాలకోడేరు : వాలంటీర్ వ్యవస్థతో ప్రజలకు పౌర సేవలు చేరువయ్యాయని ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ మంతెన యోగేంద్రబాబు అన్నారు. కోరుకొల్లు, మైప గ్రామాలకు సంబంధించి కోరుకొల్లు గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యోగేంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై పలువురికి ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్లపై అసత్య ఆరోపణలు చేసి వారి మనోధైర్యాన్ని దెబ్బతీయవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఎన్.మురళీగంగాధరరావు, ఉప తహశీల్దార్ శివకృష్ణ, గృహ నిర్మాణ శాఖ డి శివరామరాజు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : చంద్రబాబు నాయుడు వాలంటీర్లపై వేసే నిందలను పవన్‌కల్యాణ్‌తో చెప్పించడం సిగ్గుచేటని ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. మార్టేరు రెడ్డి కళ్యాణ మండపంలో మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ముఖ్య అతిథిగా రాజమండ్రి రుడా ఛైర్మన్ మేడపాటి షర్మిలారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ గత నాలుగేళ్లుగా మార్టేరు గ్రామంలో అభివృద్ధికి రూ.20 కోట్లు, సంక్షేమానికి రూ.20 కోట్లు మంజూరు చేశామన్నారు. సురక్ష కార్యక్రమానికి 20 రోజులు ముందుగానే లబ్ధిదారులకు కావాల్సిన 11 రకాల సర్టిఫికెట్లను 1374 మంది అర్హులైన లబ్ధిదారులకు అందించే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భీమవరం రూరల్ : సిఎం జగన్ ప్రతి కుటుంబానికి రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు మేలు జరిగే విధంగా నవరత్న పథకాలను అమలు చేస్తున్నారని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పట్టణంలో 5, 17, 31 వార్డుల్లో మంగళవారం నిర్వహించిన సభల్లో ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వాలంటీర్లపై పవన్‌కల్యాణ్ వ్యాఖ్యలు దారుణమన్నారు. గతంలో చంద్రబాబు కూడా వాలంటీర్ల వ్యవస్థపై అనుచితంగా మాట్లాడారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూడా అమలు చేసే దిశలో భాగంగా గత నాలుగేళ్ల పాలల్లో 98 శాతానికి పైగా హామీలను అమలు చేసిన ఘనత దేశంలో సిఎం జగన్‌కే దక్కిందన్నారు. నిత్యం ప్రజల కోసం పనిచేసే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా మద్దతు పలకాలని ఆయన కోరారు.

పాలకొల్లు రూరల్ : మండలంలోని కాపవరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అర్హులైన లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందించారు. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి పేదవానికి ఇంటి వద్దకే అన్ని సౌకర్యాలు అందాలని ఉద్దేశంతో జగన్ ఈ కార్యక్రమం ప్రారంభించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, జెడ్‌పిటిసి సభ్యులు నడపన గోవింద్‌రాజ్, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి, మండల కన్వీనర్ ఎం.మైకేల్‌రాజ్, జెసిఎస్ కన్వీనర్ వెంకటరత్నం, వాలమర్రు సర్పంచి సత్యనారాయణ, ఎంపిటిసి సభ్యులు సాయిబాబు, పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని జగన్నాధపురంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు, ఆచంట ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల సేవలను అందిస్తున్నామన్నారు. ప్రజలంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరు పెద్దిరాజు, ఎంపిపి సుమంగళి సాగర్, గ్రామ సర్పంచి గుడాల శిరీష చంటి, ఎపి సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, ఎంఇఒ జి.సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి ఎం.బలరామరాజు, ఆర్ఐ కె.రాంబాబు, పంచాయతీ కార్యదర్శి ఎన్.సుధారాణి పాల్గొన్నారు.

మొగల్తూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని మొగల్తూరు 3, 4, మోడి గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ప్రజలకు వివిధ రకాల సర్టిఫికెట్లను అందించారు. అనంతరం సచివాలయాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎపిడి విజయలక్ష్మి, ఎంపిడిఒ యు.బాబ్జిరాజు, తహశీల్దార్ జి.అనితకుమారి, ఇఒపిఆర్‌డి నవీన్‌కిరణ్, గ్రామ సర్పంచులు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆచంట : మండలంలోని ఆచంట వేమవరం, పెనుమంచిలి గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచులు జక్కంశెట్టి చంటి, గణేశుల శేషువాణి, సుబ్బారావు, ఎంపిడిఒ జగన్నాధరావు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, వివిధ గ్రామాల సర్పంచులు, వైసిపి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెనుగొండ : పెనుగొండ మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్‌ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 770 సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో మేడపాటి షర్మిలారెడ్డి, తహశీల్దార్ గురుమూర్తి రెడ్డి, చంద్రమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

అత్తిలి : మండలంలోని పాలిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ బుద్దాల భరణి, వైసిపి మండల అధ్యక్షులు పైనబోయిన సత్యనారాయణ అత్తిలి గ్రామ ఉపాధ్యక్షులు మద్దాల శ్రీను, సాబుద్దీన్ పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం విఆర్ఒల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన పాలి గ్రామంలో విఆర్ఒగా పనిచేస్తున్న భూపతిరాజు రవీంద్రరాజును సన్మానించారు.

గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని బిఆర్.అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలల్లో మిగిలి ఉన్న సీట్ల కోసం మంగళవారం పెదతాడేపల్లి గురుకుల పాఠశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న పెదతాడేపల్లి, ఆరుగోలను, నరసాపురం, పెదవేగి, చింతలపూడి పాఠశాలలకు సంబంధించి మిగిలి ఉన్న ఐదో తరగతి సీట్ల భర్తీ నిమిత్తం కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు వచ్చిన విద్యార్థులకు డిఇఒ ఎన్.భారతి ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఖాళీలు ఏర్పడిన సీట్లను ఆర్డర్ ఆఫ్ ప్రయారిటీ ప్రకారం సర్దుబాటు చేస్తామని ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు.

అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

గణపవరం : విశాఖపట్నం మధురవాడలో బిఆర్.అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ గణపవరం మండల కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు అర్థవరంలో అంబేద్కర్ విగ్రహం వద్ద మండల కమిటీ ఆధ్వర్యాన మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మధురవాడ దుండగులను గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిన్నం వంశీ, ఎరిచర్ల ఇస్సాకు, కట్టూరి ప్రసాద్ పాల్గొన్నారు.